ఆదాయమున్నా.. వసతులు సున్నా

- కొండపి ఆర్టీసీ బస్టాండ్ కనీస వసతులు కరువు
- నిరుపయోగంగా మంచినీటి ట్యాంక్.
- కనీస సౌకర్యాలు లేక ప్రయాణికుల పాట్లు
- పట్టించుకోని అధికారులు


కొండపి ఆర్టీసీ బస్టాండ్

కొండపి:

కొండపి ఆర్టీసీ బస్టాండ్‌లో వసతుల లేమితో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం వేల మంది ప్రయాణం సాగించే బస్టాండ్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రయాణికులు కూర్చునేందుకు కనీసం సరైన బెంచీలు కూడా లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నిత్యం వేలాదిమంది ప్రయాణం.

కొండపి బస్టాండ్‌కు ఒంగోలు నుంచి టంగుటూరు మీదుగా 28 ట్రిప్పులు, ఒంగోలు నుంచి మద్దూలూరు మీదుగా 28 ట్రిప్పులు, పొదిలి నుంచి కొండపికి ఆరు ట్రిప్పులు, కందుకూరు నుంచి ఐదు ట్రిప్పులు చొప్పున రోజుకి 67 ట్రిప్పులు బస్సులు తిరుగుతుంటాయి. ఇలా నిత్యం వేల మంది ప్రయాణం సాగిస్తుంటారు. ప్రయాణికుల ద్వారా నిత్యం లక్షల్లో ఆదాయం వస్తున్నా కనీస సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు.

కొరవడిన నిఘా

నిత్యం ఉదయం, సాయంత్రం విద్యార్థులు, ఉద్యోగులతో బస్టాండ్ హడావుడిగా ఉంటుంది. అయితే ఇంత మంది విద్యార్థులు బస్టాండ్‌కి వస్తున్నా వారి మీద నిఘా ఉంచడానికి ఒక్క నిఘా కెమెరా కూడా అందుబాటులో లేదు.రెండు నెలల క్రితం కొండపి బస్టాండ్‌లో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బస్టాండ్ లో సీసీ కెమెరాలు అందుబాటులో లేకపోవడంతో పోలీసులు ఆ కేసును ఛేదించడానికి బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజ్ లను తీసుకున్నారు. అదే బస్టాండ్‌లో కానీ సీసీ కెమెరాలు ఉంటే చోరీకి గురైన ఆభరణాలను వెను వెంటనే గుర్తించేందుకు వీలుండేది. ప్రయాణికుల భద్రత కోసం సీసీ కెమెరాలు బిగించాలని కోరుతున్నారు. ఇక బస్టాండ్లో కంట్రోలర్ ఏ సమయంలో అందుబాటులో ఉంటారో అర్థం కాని పరిస్థితి. దీంతో ప్రయాణికులు ఏదైనా సమస్య వస్తే ఎవరినీ సంప్రదించాలో తెలియడం లేదు.


ఒక్క ఫ్యాన్ కూడా లేని బస్టాండ్

ఆదాయం ఎక్కువే..

కొండపి బస్టాండ్ పరిధిలో దాదాపు 15 షాపులు ఉన్నాయి. అందులో 13 షాపులను వివిధ వ్యాపారులు వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ 13 షాపుల వల్ల నెలకు లక్షల్లో ఆదాయం వస్తుంది. ఇంత ఆదాయం వస్తున్నా బస్టాండ్లో సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు వెనుకాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

ఎక్కడ కూర్చోవాలి..?

బస్టాండ్లో కనీసం ప్రయాణికులు కూర్చునేందుకు కుర్చీలు కూడా అందుబాటులో లేవు. బస్టాండ్‌లో కేవలం 4 బల్లలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అందులోని రెండు బల్లలు కంట్రోలర్ రూంలో ఏర్పాటు చేసుకున్నారు. మిగిలిన రెండు బల్లలను ప్రయాణికులకు ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు ఏర్పాటుచేసిన బల్లలు కూడా మరమ్మతులకు గురయ్యాయి. ప్రయాణికులు కూర్చునేందుకు బల్లలు కూడా లేకపోవడంతో బస్సుల కోసం గంటల తరబడి నిలువు కాళ్లపై నిలబడాల్సిన పరిస్థితి. ఈ బస్టాండ్‌లో ఫ్యాన్ అనేది ఎప్పుడూ చూడలేదని ప్రయాణిలంటున్నారు. మామూలు రోజుల్లో ఎలా ఉన్నా ఎండాకాలం ఉక్కపోత రోజుల్లో ఫ్యాన్ కూడా లేకపోవడంతో ప్రయాణికులు చెమటలు కక్కుతూ బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. వేసవిలో కొన్ని రోజులు 40 డిగ్రీలకు పైన ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉన్నాయి. ఆ సమయంలో బస్టాండ్లో బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులు కనీస సౌకర్యం కూడా లేకపోవడంతో నరకం అనుభవించే పరిస్థితి ఏర్పడింది.


ప్రయాణికులు కూర్చోవడానికి వేసిన విరిగిపోయిన బల్ల.

నిరుపయోగంగా వాటర్ ట్యాంక్


నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

దాహం వేస్తే తాగేందుకు చుక్క నీరు కూడా అందుబాటులో లేదు. ఉన్న మంచి నీరు ట్యాంక్ అలంకారప్రాయంగా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల్లో కాస్త స్తోమత కలిగిన వాళ్లు వాటర్ బాటిళ్లు కొనుగోలు చేస్తున్నారు. కానీ పేద, మధ్య తరగతి ప్రజలు దాహం వేసినా ఏం చేయలేని పరిస్థితుల్లోనే గొంతెండుతుందంటున్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆదిమూలపు సురేష్, వెంకారెడ్డి, దద్దాల నారాయణ యాదవ్ , కదిరి బాబురావు

కనిగిరిరూరల్/సింగరాయకొండ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలువురు నేతలు బుధవారం తాడేపల్లి కార్యాలయంలో కలిశారు. పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ, విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కదిరిబాబురావులు జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న జడ్జి రూపశ్రీ

కనిగిరిరూరల్: జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం బ్యాంక్ అధికారులకు, మున్సిపల్, బీఎస్ఎన్ఎల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బి.రూపశ్రీ మాట్లాడుతూ వచ్చే నెల 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ప్రజలకు ఇదోక సువర్ణ అవకాశమన్నారు. కోర్టుల్లో ఎప్పటి నుంచో ఉన్న కేసులను రాజీ చేసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. క్రిమినల్, సివిల్, బ్యాంక్‌లకు సంబంధించిన కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని వివరించారు.

ఉపాధి కూలి విడుదల చేయాలి


తేటుపేటలో ఉపాధి శ్రామికులతో మాట్లాడుతున్న మస్తాన్

పొన్నలూరు: ఉపాధి కూలీలకు కూలి నగదు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయక కార్యదర్శి కేజీ మస్తాన్ డిమాండ్ చేశారు. మండలంలోని తేటుపేటలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించి శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

సింగరాయకొండ: పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించవద్దని, పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు డీఎల్‌పీఓ పద్మ అన్నారు. స్థానిక పంచాయతీలో పారిశుధ్య పనులను బుధవారం పర్యవేక్షించారు. డీఎల్‌పీఓ పద్మ మాట్లాడుతూ జిల్లాలో చెత్త రహిత గ్రామాలు కార్యక్రమంలో భాగంగా మండలంలో సింగరాయకొండ, మూలగుంటపాడు, పాకల, బింగినపల్లి, కలికవాయ గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ఈ గ్రామాల్లో నిత్యం తప్పనిసరిగా చెత్త సేకరించి చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. చెత్త సేకరణపై కార్మికులతో పాటు ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి జగదీష్, ఈఓఆర్‌డీ ఆర్ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ ఎక్సరే ప్రారంభం

కొండపి: స్థానిక పీహెచ్‌సీలో డిజిటల్ ఎక్సరే మిషన్‌ను మంత్రి స్వామి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ నాయక్, సెకండరీ హెల్త్ ప్రోగ్రాం అధికారి సూరిబాబు, ఎంఎన్‌సీయూ నోడల్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, వైద్యురాలు నాగమణి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలుపాటించాలి

హనుమంతునిపాడు: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎం మాధవరావు అన్నారు. స్థానిక కంభం-కనిగిరి రహదారిలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహనదారులు విధిగా ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

30 లోగా దరఖాస్తు చేసుకోవాలి

హనుమంతునిపాడు: రీసర్వే జరిగిన గ్రామాల్లోని రైతులు జాయింట్ పట్టాదారులు సబ్ డివిజన్ కోసం ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ షేక్ నాగూల్ మీరా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందాపురం, అగ్రహారం, ముప్పళ్లపాడు, దాసళ్లపల్లి, నల్లగండ్ల, నీలకంఠాపురం, హనుమంతునిపాడు, కోటతిప్పల్ల గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. సబ్ డివిజన్ కోసం రూ.50 రుసుం సచివాలయాల్లో చెల్లిస్తే జాయింట్ పట్టాలను సబ్ డివిజన్ చేసి సింగిల్ పట్టాదారులుగా నమోదు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లింగనిర్ధారణ పరీక్షలు నేరం


మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి

కనిగిరిరూరల్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994 అమలుపై డివిజన్ స్థాయి మల్టీ మెంబర్ అథారిటీ సలహా కమిటీ సమావేశం స్థానిక కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గర్భస్థ శిశువులను కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ రెన్యువల్, ఆకస్మిక తనిఖీలు సంబంధిత అధికారులు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించని కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఎంపీల వైద్య చికిత్సలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ ఉండాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సృజన మాట్లాడుతూ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. యాక్ట్ ఇంప్లిమెంట్ కమిటీ చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమతి, ఏఎస్ఐ భాస్కర్‌రావు, వివిధ సంస్థల ప్రతినిధులు, రమేష్‌బాబు, నవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

30న మండల సమావేశం

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం మండల సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్ బ్రహ్మయ్య తెలిపారు. ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యులతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు. అన్నిశాఖల అధికారులు సంబంధిత వివరాలతో సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

పొలాలు కోల్పోయే రైతులకు పరిహారం


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఆర్డీఓ

సీఎస్‌పురం(పామూరు): గ్రీన్‌ఫీల్డ్ హైవేలో పొలాలు కోల్పోయే రైతులందరికీ త్వరితగతిన పరిహారం అందేలా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డికి సూచించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను భూములు కోల్పోయే రైతులు సోమవారం అడ్డుకోవడంతో దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, ఆర్డీఓ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమయ్యారు. త్వరలో పరిహారం వస్తుందని హైవే నిర్మాణ పనులను అడ్డుకోవద్దని రైతులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ హుస్సేన్, వీఆర్‌ఓలు, నాయకులు వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

చిన్నారుల సమగ్ర సమాచారాన్ని సర్వే చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ జయమణి

సింగరాయకొండ: బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు మండలంలోని చిన్నారుల సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ఎంపీడీఓ డి.జయమణి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బంగారుబాల్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మహిళా పోలీసులు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, వసతిగృహాలు, పాఠశాలల్లో చదువుకునే వారి జాబితాను సిద్ధం చేయాలన్నారు.

ఆ జాబితా ప్రకారం చిన్నారుల ఆర్థిక స్థితిగతుల వివరాలను బంగారుబాల్యం యాప్ అప్‌లోడ్ చేయాలని సూచించారు. బాల కార్మికులుగా ఉండకూడదన్నది లక్ష్యమన్నారు. ఈ సర్వేను 27వ తేదీ నుంచి వచ్చే నెల 7వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రిజ్వానా, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించకపోతే ఎలా..?

జరుగుమల్లి(సింగరాయకొండ): ఉపాధి కూలీలకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోతే ఎలా అని, ప్రతి వారం ఒక్కో కూలీ నుంచి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారని పైడిపాడు సర్పంచ్ నాగినేని భాస్కర్ అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లం నిర్మల అధ్యక్షతన బుధవారం మ,డల సమావేశ, నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ జోత్స్న మాట్లాడుతూ మే 15 వరకు కూలీల వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. కూలీల వద్ద నగదు వసూలు చేస్తున్న విషయం తన దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ మురళి మాట్లాడుతూ రీ సర్వేలో తప్పుల కారణంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అర్హులకు రావటం లేదని, రికార్డుల్లో తప్పులను సరిదిద్దటానికి రైతులు రూ.50 చలానా కట్టి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ రమణమూర్తి, డిప్యూటీ ఎంపీడీఓ కామేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

హనుమంనిపాడు: మండలంలోని మహ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించినట్లు ఎంఈఓ జి.పెద్దిరాజు తెలిపారు. పిన్నెక నాగరాజు, ముక్కు చరితారెడ్డి, కమ్మి దీపక్ రెడ్డిలు ఎంపికయ్యారు. వీరిని హెచ్ఎం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

కూలీల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు

హనుమంతునిపాడు: జాతీయ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు అన్నారు. ఉపాధి కార్యాలయ ఎఫ్ఏలు, టీఏలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి పని లేదనకుండా కల్పించాలన్నారు. 23 పంచాయతీల పరిధిలో 5 వేల మంది కూలీలు పనిచేసేటట్లు చూడాలన్నారు. పని వద్ద కూలీలకు తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. బినామీ మస్టర్లు వేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపైచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొలతల ప్రకారమే బిల్లుల చెల్లింపులు జరుగుతాయన్నారు. ఏపీఓ వినయ్, టీఏలు దివ్యవాణి, రామ్‌తుల్లా, సుబ్బారెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


పనులు పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఎం ఉషా పథకం కింద నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణాలు, కళాశాల భవన మరమ్మతు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే పట్టణంలోని 8వ వార్డులో మున్సిపల్, సచివాలయ అధికారులతో కలిసి చైర్మన్ గఫార్ పర్యటించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినా, అక్రమ కట్టడాలు నిర్మించినా చర్యలు ఉంటాయన్నారు. ఏఈ మాధవరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ షరీపుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.